

పెరుగుతున్న పాల సేకరణ

- ఎట్టకేలకు గాడిన పడుతున్న విజయ డెయిరీ
- రోజుకు 10 వేల లీటర్ల పాల సేకరణ
- పాలు సరఫరా చేసే రైతుల సంఖ్య తగ్గుముఖం
- ప్రోత్సాహకాల బకాయిలు రూ.4 కోట్లు

ఖమ్మం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరకు అంతర్గత కుమ్ములాటలతో ప్రతిష్ఠ పోగొట్టుకున్న ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ గాడిన పడుతున్నది. పాలసేకరణ సైతం పెరుగుతోంది. పాల విక్రయాల ద్వారా ఏడాదికి సుమారు కోటి రూపాయల ఆదాయం పొందుతోంది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 4500 లీటర్ల పాలసేకరణ జరిగేది. ప్రస్తుతం రోజుకు 10వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఇందులో 6వేల లీటర్లను విక్రయించగా, 4వేల లీటర్ల పాలను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్, ఖమ్మం జిల్లాలలో మాత్రమే గేదెపాలు లభిస్తుంటాయి. అందుకే ఖమ్మం విజయ డెయిరీ పాలకు గిరాకీ ఉంటున్నది. విజయ డెయిరీ ఆధ్వర్యంలో డెయిరీ పార్లర్లు నిర్వహించి, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

ఏడు పాల శీతలీకరణ కేంద్రాలు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 7పాలశీతలీకరణ కేంద్రాల(బీఎంసీయూ)ద్వారా పాలను సేకరిస్తున్నారు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాలసేకరణ ఆశాజనకంగా లేదు. ఖమ్మం జిల్లాలోని విజయ డెయిరీ ద్వారా రోజుకు 4300 లీటర్లు, కల్లూరు బీఎంసీయూ ద్వారా 1000 లీటర్లు, ఎర్రుపాలెం, సత్తుపల్లి కేంద్రాల ద్వారా 800 లీటర్ల వంతున, కామేపల్లి కేంద్రం ద్వారా రోజుకు 300 లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పాలశీతలీకరణ కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు.వాటిలో కొత్తగూడెం కేంద్రం ద్వారా రోజుకు 2వేల లీటర్లు,ఇల్లెందు కేంద్రం ద్వారా 600 లీటర్లు రోజుకు సేకరిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



హాజరైన వివిధ వర్గాల ప్రతినిధులు, జిల్లా అధికారులు

ఎస్సీ, ఎస్టీల భూముల సమస్యలను పరిష్కరించాలి..

- అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి
- పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి
- దళిత, గిరిజనుల హక్కులను పరిరక్షించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో వున్న ఎస్సీ ఎస్టీల రెవెన్యూ భూ సంబంధిత కేసులపై నివేదికలు తెప్పించుకుని నెలరోజుల్లో పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబునాయక్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రీ, పోస్టు మెట్రిక్ రెసిడెన్షియల్ హాస్టల్స్ ఇందిరా మహిళా శక్తి, కార్పొరేషన్ రుణాలు దళిత బంధు, పెండింగ్ భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల నమోదు వంటి వివిధ అంశాలను అధికారులు కమిషన్ కు వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను సంబంధిత వర్గాల ప్రతినిధులు చైర్మన్ దృష్టికి తీసుకుని వచ్చారు.

అనంతరం చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు వెళ్తారని, అక్కడ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5కోట్ల నుంచి 10 కోట్ల వరకు నిధులు పెట్టి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో ఉన్న 300 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని, డిసెంబర్ నెలలో ప్రారంభించి మార్చి నాటికి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు, మధ్యాహ్న భోజన నాణ్యత పెంపు, ఆంగ్ల పరిజ్ఞానం పెంపునకు కార్యక్రమాలను అమలు చేస్తున్న కలెక్టర్‌ను అభినందించారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధించి 40 ఎస్సీ, ఎస్టీ దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, కమిషన్ ఆదేశాల మేరకు నెల రోజుల వ్యవధిలో వీటిని పరిష్కరిస్తామన్నారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు 50 ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద జిల్లాలో పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. కేసులు రిజిస్టర్ చేయడంలో అలసత్వం లేదని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, అదనపు డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, అధికారులు, ఏసీపీలు పాల్గొన్నారు.



పత్తి విక్రయాలకు పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డుకు మంగళవారం తెల్లబంగారం పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు అధికమొత్తంలో పత్తిని తీసుకు రావడంతో ఉపమార్కెట్ సమీపంలోని రాష్ట్రీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గతకొద్ది రోజులుగా పత్తిని తీసుకొచ్చే వాహనాలతో రాష్ట్రీయ రహదారి రద్దీగా మారడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి, జూలూరుపాడు



టీటీడీ బోర్డు నూతన చైర్మన్‌గా నియమితులైన బి.రాజగోపాల నాయుడును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలను ఆమోదించి దేవదేవుడిని దర్శించుకొనే భాగ్యాన్ని కల్పించాల్సిందిగా మంత్రి తుమ్మల కోరారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



భద్రాద్రికి త్వరలో పాలక మండలి

- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 12 ఏళ్ల తర్వాత ఏర్పాటు కానున్న కమిటీ
- ఇప్పటి వరకు 13 పాలక మండళ్లు
- అధికార పార్టీ నుంచి పలువురు ఆశావహులు

6



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైతులకు నష్టం చేస్తే వ్యాపారుల లైసెన్సుల రద్దు

- మద్దతు ధర కన్నా తక్కువకు కొనవద్దు
- అధికారులు బ్రోకర్లకు ఏజెంట్లుగా వ్యవహరించొద్దు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పత్తి మార్కెట్‌లో ఆకస్మిక పర్యటన
- తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారికి నోటీస్
- కలెక్టర్‌కు గోడు చెప్పుకొని విలపించిన రైతులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను తక్కువ ధరలకు కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులపై, మార్కెట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులు తిరుగుతూ రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయన చేయి పట్టుకొని విలపించారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్మకానికి తీసుకొస్తే తమకు గిట్టుబాటు ధరలకు కాకుండా తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను తక్కువ ధరకు అమ్ముకుంటే తాము తీవ్రంగా నష్టపోతున్నామని, అమ్ముకోకుండా తిరిగి ఇంటికి తీసుకెళ్తే అక్కడ కూలీల ఖర్చులు, ఇతర పంటల పెట్టుబడి ఖర్చులు ఎదురు చూస్తున్నాయని అందుకే తక్కువ ధరలకు అమ్ముకొని నష్ట పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తిలో తేమ శాతం 15 కన్నా తక్కువగా ఉన్నా క్వింటాలు పత్తిని రూ. 6,500కే కొనుగోలు చేశారని ఒక రైతు పేర్కొనగా వెంటనే తేమ కొలిచే పరికారాన్ని తీసుకురమ్మని ఆదేశించారు. సదరు రైతు పత్తిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్వయంగా తేమ శాతం పరిశీలించగా ఆ పత్తిలో తేమ 15 శాతం మాత్రమే ఉంది. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారికి తక్షణమే నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

బ్రోకర్‌లకు ఏజెంట్లుగా ఉండొద్దు..

మార్కెట్‌లో ఉండే బ్రోకర్ల మాట విని బ్రోకర్లు కావద్దని, వారికి మీరు ఏజెంట్లుగా ఉండొద్దని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డిని కలెక్టర్ హెచ్చరించారు. తక్కువ ధరలకు కొనుగోలు చేసే వ్యాపారి తన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం (మిగతా 6వ పేజీలో)



'బోడు' వాసుల కన్నీటి గోడు

6

- తమను స్థానికులుగా గుర్తించాలని వేడుకోలు
- సమగ్ర సర్వే గొత్తికోయల జీవితాల్లో వెలుగులు నింపేనా?
- ఎర్రబోడు, మంగలిబోడులో జబ్బు చేస్తే ఆకు పసర్లే దిక్కు
- బిక్కు బిక్కుమంటూ బతుకుతున్న వలస ఆదివాసీలు

గ్రూప్- 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ శ్రీజ



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డితో కలిసి టీజీపీఎస్సీ గ్రూప్ - 3 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 17,18న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లతో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష ముందు రోజు, పరీక్ష రోజు పరీక్ష నిర్వహణ విధుల అధికారులు చేయవలసిన పనులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో మొత్తం 27 వేల 984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరి కోసం 87 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఖమ్మంలోని విజయ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఎస్‌బీఐటీ ప్రిన్సిపాల్‌లను రీజనల్ కో ఆర్డినేటర్లుగా నియమించినట్లు చెప్పారు. పరీక్ష ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రి ప్రభుత్వ వైద్య కళాశాల ఓల్డ్ ట్రెజరీ రూమ్ లో భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ప్రతి 3 నుంచి 5 పరీక్ష కేంద్రాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసామని వారు తెలిపారు.

ఈ సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో నర్సింహారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, పరీక్షల కోఆర్డినేటర్లు కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు పాల్గొన్నారు.


ఫోకస్

'బోడు' వాసుల గోస

"చంద్రుగొండ రేంజ్ అధికారి శ్రీనివాసరావు హత్యతో వెలుగులోకి వచ్చిన ఎర్రబోడు, మంగలిబోడు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వలస ఆదివాసీలు(గొత్తికోయలు) సమగ్ర కుటుంబ సర్వేపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో జీవిస్తున్న తమను వలస దారులమంటూ పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. రేషన్, ఆధార్, ఓటరు కార్డులు తమలో చాలా మందికి ఉన్నాయని, మరి తామెలా వలసదారులం అవుతామని ఎర్రబోడు గుంపు పెద్ద రవ్వ రమేష్ ప్రశ్నిస్తున్నారు."



అడవిలో ఆదివాసీల ఆవాసాలు



వైద్యం అందక బక్కచిక్కిన మడకం జోగా

- స్థానికులుగా గుర్తించాలని వేడుకోలు
- సమగ్ర సర్వే గొత్తికోయల జీవితాల్లో వెలుగులు నింపేనా?
- రెండు దశాబ్దాలుగా అందని విద్య, వైద్యం
- ఎర్రబోడు, మంగలిబోడులో జబ్బు చేస్తే ఆకు పసర్లే దిక్కు..
- వసతులు కల్పించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి..
- తాత్సారం చేస్తున్న అధికారులు
- బిక్కు బిక్కు మంటు బతుకుతున్న వలస ఆదివాసీలు

చంద్రుగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలన్న అమలు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. గతంలో సీఎంను కలిసి తమ దయనీయ స్థితిని వివరించి ఆదుకోవాలని కోరామని, ఆసమయంలో సీఎం స్పందించి ఆదివాసీల ఆవాసాలలో మౌలిక వసతు కల్పించాలని ఆదేశాలిచ్చారు. దీంతో అప్పటి కలెక్టర్ మంగలిబోడు, ఎర్రబోడును పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వారు ఆవాసాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కానీ నెలలు గడుస్తున్నా ఎటుంటి కదలికలేదు.

ప్రాణాలైనా ఇస్తాం.. అడవిని వీడం..

ఛత్తీస్‌గడ్‌లో పోలీసు, మావోయిస్టుల నిర్బంధాన్ని తట్టుకోలేకే ప్రశాంత జీవనం కోసం 20 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చామనిఎర్రబోడు కుల పెద్ద రవ్య రమేష్ తెలిపారు. కూలి పనులతో పాటు వాగులు వంకల్లో పంటలు సాగు, మేకలు, కోళ్లు, పశువులు పెంచుకొని జీవిస్తున్నామని అన్నారు. కొంత కాలం ప్రశాంతంగానే జీవనం సాగిందని , ప్రభుత్వ గుర్తింపు కార్డులు సైతం అధికారులు జారీచేశారని తెలిపారు. అయినా తమకు ఇక్కడ ఉండే హక్కులేదని, వెళ్లిపోవాలని నిర్బంధం చేయడం అన్యాయమని వారంటున్నారు. ప్రాణాలు తీసినా ఇక్కడే ఉంటామని, ఈ మట్టిలోనే కలిసిపోతామని ఆదివాసీలు తెగేసి చెబుతున్నారు.

కొత్తగా పోడు కొట్టం.. పాత పోడు వదలం.

'తెలిచో తెలియకో అడవిలేని ప్రాంతాన్ని పోడుకొట్టి సాగు చేసుకున్నాం.. ఈ ప్రాంత గిరిజనులు చేసిన పనే మేము చేశాం... కానీ వారికి పట్టాలు ఇచ్చారు.. మా భూములు గుంజుకున్నారని ఎర్రబోడు గిరిజనులు అంటున్నారు. ప్రభుత్వమే గుర్తింపు కార్డులతో ఈ ప్రాంత వాసులుగా గుర్తింపు పొందామని, అయినా తమ పట్ల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అడవే తమకు అన్నం పెడుతుందని, అడవిలో ఉండేది మాజాతి ఒక్కటేనని, తల్లిలా భావించే అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికంటే తమపై ఎక్కువగా ఉందంటున్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కొత్తగా పోడు కొట్టబోమని చెబుతున్నారు.

విద్య లేదు, వైద్యం లేదు..

20 ఏళ్లుగా ఎర్రబోడు, మంగలిబోడులో ఉంటున్నా తమకు చదువు వైద్యం అందడం లేదని గిరిజనులు వాపోతున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేక పిల్లలు అడవులు వెంట తిరుగుతున్నారని, చిన్నారులకు పౌష్టికాహారం లేక బక్కచిక్కి అనారోగ్యం పాలవుతున్నారని కన్నీటి పర్యంతం అవుతున్నారు. అధికారులు మాత్రం ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం ఉన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. వైద్య అందక దీర్ఘకాలిక వ్యాధుల పాలువున్నామని, జబ్బు చేస్తే అడవి ఆకులే మందుగా వాడుతున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులను, స్థానిక ఎమ్మెల్యేను కలిసినా ఎవరూ పట్టించుకోలేదని, సాక్షాత్తు ముఖ్యమంత్రిని కలిశామని, ఏమైనా మార్పు వస్తుందని ఆశిస్తున్నామని ఎర్రబోడు గ్రామ పెద్దలు మాడి భీమా, రవ్య రమేష్, వెంకట్రావ్ పేర్కొన్నారు.

మాడిపోయిన అన్నం.. నీళ్లలాంటి చారు...

- వసతి గృహాల్లో అమలుకాని మెనూ
- రాత్రి మిగిలిన భోజనమే.. ఉదయానికి అల్పాహారం
- వంట మనిషే వసతి గృహానికి దిక్కు
- అశ్వారావుపేట హాస్టళ్లపై పర్యవేక్షణ కరువు

అశ్వారావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల మెస్ చార్జీలను పెంచింది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఒకరకమైన మెనూను నిర్దేశించింది. కాని అశ్వారావుపేట హాస్టల్స్‌లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ మచ్చుకు కూడా కనిపించదు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పట్టణంలోని బీసీ హాస్టల్‌ను విజిట్ చేసినప్పుడు విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. విద్యార్థులు పడే కష్టాలు వెలుగులోకి వచ్చాయి.

అశ్వారావుపేటలో ప్రభుత్వం మెనూతో పనిలేకుండా స్థానికంగా హాస్టల్‌లో ఏది నిర్ణయిస్తే అదే మెనూ అవుతోంది. బీసీ హాస్టల్‌లో రాత్రి పూట మిగిలిన భోజనాన్ని తెల్లవారుజామున అల్పాహారంగా ఉపయోగించినట్లు విద్యార్థులు చెబుతున్నారు. మధ్యాహ్నం భోజనం కింద జీరా రైస్ తయారు చేశారు. ఈ రైస్ అంతా మాడిపోయి కనిపించింది. ఈ రైస్‌లో వేసుకోవడానికి చారును తయారు చేశారు. వీటితోనే విద్యార్థులకు భోజనం వడ్డించారు. హాస్టల్‌లో 30మంది విద్యార్థులున్నట్టు చెబుతున్నప్పటికీ, మంగళవారం పది మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేశారు. కనీసం విద్యార్థుల భోజనాన్ని పర్యవేక్షించడానికి వార్డెన్ కూడా లేరు.

ఆ వార్డెన్‌కు అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నాలుగు హాస్టల్స్‌కి ఇన్‌చార్జిగా ఉన్నారు. వంట మనిషే వంట చేసి పిల్లలకు భోజనం పెడుతుంది. ఇదీ ఇక్కడ ప్రత్యేక మెనూ. ప్రభుత్వం అందిస్తున్న మెనూను పక్కన పెట్టి ఇక్కడ ప్రత్యేక మెనూను తయారు చేస్తున్నారని, నాసిరకంగా వంటలు ఉంటున్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై వార్డెన్ శ్రీనివాసరావును వివరణ కోరగా రాత్రి భోజనాన్ని ఉదయం పెట్టడం జరగదన్నారు. తనకు ఇటీవలే ప్రమాదం జరగడంతో చికిత్స పొందుతున్నానన్నారు. విద్యార్థులు తక్కువగా వస్తున్నమాట వాస్తవమేనని, త్వరలోనే అన్ని సర్దుబాటు చేసుకుంటామని, నాణ్యమైన భోజనం అందిస్తామని తెలిపారు.



నేలపై కూర్చుని భోజనం చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

పర్ణశాల ప్రధాన రహదారిపై పారుతున్న సాగునీరు

- ఇబ్బందులు పడుతున్న యాత్రికులు



ఆర్అండ్‌బీ రహదారిపై పారుతున్న నీరు

దుమ్ముగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అది ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రామాలయానికి వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి. మామూలు రోజుల్లో పదుల సంఖ్యలోనూ శని, ఆదివారం, పండగ సెలవు దినాల్లో వందల సంఖ్యలో ఈ దారిపై పలు రకాల వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అయితే ఈ ప్రధాన రహదారిపై గత రెండు వ్యవసాయ సీజన్ల నుంచీ సాగునీరు పారుతోంది. వరి సాగు చేస్తున్న కొందరు స్థానిక రైతులు తమ పొలాలకు ఈ రహదారి గుండా చెరువు నుంచి సాగునీటిని మళ్లిస్తున్నారు. దీంతో పలు రకాల వాహనాలపై పర్ణశాల వచ్చే యాత్రికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రహదారి దిగువ భాగం గుండా పైపులైను ఏర్పాటు చేసుకునేందుకు సదరు రైతులు అనాసక్తత ప్రదర్శిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సైతం ఈ రహదారి నిర్వాహణపై పర్యవేక్షణను గాలి కొదిలేశారనే ఆరోపణలు వినబడుతున్నాయి. అసౌకర్యం కలగకుండా సమస్యను పరిష్కరించాలని ఆర్అండ్‌బీ అధికారులను యాత్రికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్‌ను వివరణ కోరగా, తాలిపేరు డీఈతో మాట్లాడామన్నారు. పనులు చేయిస్తామని తనకు సమాచారమిచ్చారని, చేయించని పక్షంలో గోతులమయంగా మారిన ప్రాంతంలో బీటీ వేస్తామని తెలిపారు.

మంత్రులకు సైన్స్‌ఫేర్ ఆహ్వానం





మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లిలో ఈనెల18వ తేదీ నుంచి 20వరకు సాంఘిక సంక్షేమ హాస్టల్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనాలని వ్యవసాయశఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆహ్వానించారు. హైదరాబాద్ వెళ్లిన ఆయన మంగళవారం వారి కార్యాలయాల్లో మంత్రులను కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు.

ఏకలవ్యను సందర్శించిన చైర్మన్ పొదెం

దుమ్ముగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం ఏకలవ్య గురుకులం పాఠశాలను అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మంగళవారం సందర్శించారు. ప్లస్‌టూ విద్యార్థిని మట్టా ధనలక్ష్మి ఆత్మహత్యా యత్నానికి గల కారణాలను వైస్ ప్రిన్సిపాల్ నుంచి అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. వసతిగృహంలో ఉంటూ చదువుతున్న విద్యార్థులను తల్లిదండ్రుల్లా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గురుకులం ఆర్సీవో నాగార్జునరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వినీల్, దేవా, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న పాలసేకరణ

(5వ పేజీ తరువాయి)

10వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు.

తగ్గుతున్న పాల రైతులు

విజయ డెయిరీ పరిస్థితి విచిత్రంగా ఉంది. డెయిరీకి పాలుపోసే రైతుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ పాలసేకరణ పెరుగుతోంది. గతంలో పాడి రైతుల సంఖ్య 3వేలకు పైగా ఉండగా, ప్రస్తుతం 1600 మంది పాడిరైతులు మాత్రమే విజయ డెయిరీకి పాలుపోస్తున్నారు. 5శాతం వెన్న ఉన్న గేదెపాలు లీటరుకు విజయ డెయిరీ 40 రూపాయలు చెల్లిస్తోంది. 19శాతం వెన్న ఉన్న పాలకు రూ.80 చెల్లిస్తున్నారు. ఇక 3శాతం వెన్నఉన్న లీటరు ఆవుపాలకు రూ.40, 4 శాతం వెన్నఉన్న పాలు లీటరుకు సుమారు రూ.47 చెల్లిస్తున్నారు. అయితే ప్రయివేట్ డెయిరీలు ఎక్కువగా ధర చెల్లించటం, విజయ డెయిరీకి పాలుపోసిన పాడిరైతులకు సకాలంలో పాలబిల్లులు రాకపోవటం తదితర కారణాలతో విజయ డెయిరీకి పాలుపోసే రైతుల సంఖ్య తగ్గుతోంది. అయినప్పటికీ అధికారుల కృషితో పాలసేకరణ పెరుగుతోంది.

ప్రోత్సాహకాల బకాయిలు రూ.4కోట్లు

విజయ డెయిరీకి పాలుపోసే రైతులకు లీటరుకు రూ.4వంతున ప్రోత్సాహకం ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు గతంలో నిధులు విడుదల చేసింది. అయితే తరువాత నిధులను విడుదల చేయకపోవటంతో ప్రోత్సాహకాల బకాయిలు రూ.4కోట్లకు చేరాయి. తొలుత ప్రకటించి,తరువాత నిధులు ఇవ్వకపోవటంతో పాడిరైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు.

పాలసేకరణ పెంపునకు కృషి: మోహనమురళి, విజయ డెయిరీ డీడీ



పాడిరైతుల సహకారంతో పాలసేకరణ పెంపుకు కృషి చేస్తున్నట్లు విజయ డెయిరీ ఉమ్మడి జిల్లా డీడీ మోహనమురళి పేర్కొన్నారు. పాల బిల్లులు సకాలంలో వచ్చేవిధంగా ఉన్నతాధికారుల దృష్టికి తెస్తున్నామన్నారు. పాడి రైతులతో తరచూ సమావేశాలు నిర్వహించి, పాలసేకరణ పెంపుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. పాల శీతలీకరణ కేంద్రాలను సందర్శించి, అక్కడి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. విజయ డెయిరీకి పాలు పోయటంవల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

భద్రాద్రికి త్వరలో పాలక మండలి

నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానం పాలక మండలి త్వరలో ఏర్పాటు కానుంది. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్న సమయంలో 2010 నవంబరు 26 నుంచి 2012 నవంబరు 25 వరకు రెండేళ్లపాటు చివరి పాలక మండలి కొనసాగింది. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయం, నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుకు పలుమార్లు కదలిక వచ్చినా అది ఆచరణ రూపం దాల్చలేదు. రెండోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ ను ప్రభుత్వం జారీ చేసినా అది ఆచరణ రూపం దాల్చలేదు. దేవస్థానంకు 12 ఏళ్ల తరువాత పాలక మండలి కొలువుదీరేందుకు మంగళవారం నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో భద్రాచలం ఏజెన్సీకి చెందిన రాజకీయ నాయకులతో పాటు రాష్ట్రంలోని ప్రముఖులందరూ భద్రాచలం పాలక మండలిలో స్థానం దక్కించుకునేందుకు పోటీపడే అవకాశం ఉంది.

ఇప్పటి వరకు 13 పాలక మండళ్లు...

రామాలయానికి ఇప్పటి వరకు 13 పాలక మండళ్ల ఏర్పాటయ్యాయి. 1960లో భద్రాద్రి రామాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చింది. ఆ సమయంలో అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్‌గా రామాలయ అభివృద్ధి కమిటీ రూపుదిద్దుకుంది. తొలినాళ్లలో మూడేళ్లపాటు పాలక మండలి పదవీ కాలం ఉండగా అనంతరం ఏడాది కాలం పాటు తరువాత మళ్లీ రెండేళ్లపాటు పదవీ కాలాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతన పాలక మండళ్లకు ఏడాది మాత్రమే కొనసాగే విధంగా నోటిఫికేషన్ ను జారీ చేశారు.

ఇప్పటివరకు వివిధ టర్మ్‌ల్లో పాలక మండలి చైర్మన్లుగా కల్లూరి చంద్రమౌళి, బండి శోభనాచలం, ఎస్.యతిరాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, కోనేరు నాగేశ్వరరావు, బోళ్ల వెంకటేశ్వర్లు, కత్తుల శాంతయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావు వ్యవహరించారు.

పగలు మైనింగ్.. రాత్రి లోడింగ్

- వెలుగుమట్ల అర్బన్‌పార్క్ ప్రాంతాల్లో బెరైటీస్ అక్రమ తవ్వకాలు
- ఎన్నో ఏళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న దందా
- సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం
- కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి



వెలుగుమట్ల ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి వెలికి తీస్తున్న బైరటీస్ ఖనిజం

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో యాథేచ్ఛగా ముడి బెరైటీస్ తవ్వకాలు సాగుతున్నాయి. కోట్ల విలువ చేసే ఈ ముడి ఖనిజాన్ని కొందరు అక్రమార్కులు పగలు అక్రమంగా తవ్వి అర్ధరాత్రి లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తూ కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ అక్రమ తవ్వకాలకు అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఖమ్మం అటవీ అర్బన్‌పార్క్ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ, ప్రవేటు భూముల్లో ఉన్న బెరైటీస్ ముడి ఖనిజాన్ని రాత్రి వేళల్లో తవ్వి తోలకాలు చేసేవారు. కానీ గత వారం రోజులుగా అర్బన్ పార్క్‌కు వెళ్లే దారిలో ఓ ప్రవేటు ఇంజనీరింగ్ కళాశాల పక్కనే పట్టపగలు యథేచ్ఛగా బెరైటీస్‌ను యంత్రాల ద్వారా వెలికితీస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన కొందరు ఈ తవ్వకాలకు సహకరిస్తున్నట్లు సమాచారం. సంబంధిత ప్రాంతాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఈ అక్రమ తవ్వకాలు వెలుగులోకి వచ్చాయి.

ధనార్జనే ధ్యేయంగా..

వెలుగుమట్ల అర్బన్‌పార్క్‌కు వెళ్లే దారిలో భారీగా బెరైటీస్ నిల్వలు ఉండటంతో కొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా తవ్వకాలు నిర్వహిస్తూ కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ తవ్వకాలకు కొందరు అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రాంతాల్లోని ప్రవేటు భూముల్లో బెరైటీస్ అక్రమ తవ్వకాలు జరపగా మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి సంబంధిత గనులను సీజ్ చేసి వేలంలో విక్రయించారు. దీంతో సంబంధిత భూముల యజమానులు తమ భూముల చుట్టూ ప్రహరీలు నిర్మించుకున్నారు. అయినా అక్రమార్కులు ఈ ప్రాంతాల్లోని ఇతర భూముల్లో రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరిపి కూలీలను తీసుకొచ్చి ముక్కలు ముక్కలుగా చేసి లారీల్లో తరలిస్తున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే అక్రమ తవ్వకాలు నిర్వహించే వ్యాపారులు నేడు పట్టపగలే తవ్వకాలు నిర్వహిస్తూ అర్ధరాత్రి లారీల్లో తరలిస్తుండటం వెనుక కొందరు అధికారులు ప్రమేయం ఉందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమైనా, పట్టా భూమైనా ఖనిజం వెలికి తీయాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి పొందాల్సి ఉంది. కానీ అక్రమ వ్యాపారులకు ధనార్జనే ధ్యేయంగా అక్రమ తవ్వకాలు జరిపి కొట్లాది రూపాయాలు దోచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు నిఘా పెట్టి అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలకు అడ్డుకోలేని అధికారులు

వెలుగుమట్ల అర్బన్‌పార్క్‌కు వెళ్లే దారిలో గత కొన్ని సంవత్సరాలుగా బెరైటీస్ అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయలుకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు అక్రమార్కులు కొందరు అధికారుల సహకారంతోనే ఈ అక్రమ త్వవకాలు చేస్తున్నారని, అందుకే ఈ తవ్వకాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా ఇక్కడ అక్రమంగా బెరైటీస్ తవ్వకాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిసినా నిఘా పెట్టకుండా తమకెందుకులే అనే ధోరణిలో ఉన్నారంటే ఈ అక్రమ వ్యాపారులకు కొందరు అధికారుల సహకారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఇకనైనా ఈ అక్రమ తవ్వకాలను అడ్డుకొని ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు నష్టం చేస్తే వ్యాపారుల లైసెన్సుల రద్దు

(5వ పేజీ తరువాయి)

ఎన్నో రకాల సాకులు చెపుతాడని, వారి మా టలను నమ్మొద్దని అన్నారు. వ్యాపారులైనా, అ ధికారులైనా రైతుల పక్షపాతిగా వ్యవహరిం చా లని చురకలేశారు. రైతులను నష్ట పరిచే చర్యలు ఉంటే ఉద్యోగాలు ఊడతాయని హెచ్చ రించారు.

మద్దతు ధర కన్నా తక్కువకు కొనొద్దు

మార్కెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరలకు కొనుగోలు చేసే హక్కు ఎవరికి లేదని కలెక్టర్ పేర్కొన్నారు. పత్తికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 7,520 కన్నా ఎక్కువకే కొనుగోలు చేయాలని అన్నారు. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేసే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. పత్తి లో ఒక వేళ 20 నుంచి 30 శాతం వరకు తేమ ఉంటే ఏ ధర వస్తుందో తెలియదని, 8 నుంచి 14, 15 శాతం వరకు తేమ ఉంటే మద్దతుధరకు కొనుగోలు చేయాలని సూచించారు.



పత్తిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

హాస్టల్ నుంచి పారిపోయిన ఇద్దరు విద్యార్థులు

- తల్లిదండ్రులకు అప్పగించిన టూటౌన్ పోలీలసులు
- ఊపిరిపీల్చుకున్న హాస్టల్ సిబ్బంది

నేలకొండపల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజేశ్వరపురం ఎస్సీ బాలుర వసతిగృహం నుంచి ఇద్దరు విద్యార్థులు చెప్పకుండా బయటకు వచ్చి ఖమ్మం వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం రాజేశ్వరపురం వసతిగృహంలో ఉంటున్న ఇరువురు 5వ తరగతి విద్యార్థులు రాజేశ్వరపురంలో జరుగుతున్న ఎడ్ల పందాలను చూడటానికి హాస్టల్ నుంచి బయటకు వచ్చారు. పందాలను చూసి నేలకొండపల్లికి చేరుకున్న విద్యార్థులు, అక్కడ ఓ వాహనదారుని లిఫ్ట అడిగి ఖమ్మం చేరుకున్నారు. మార్గమధ్యలో బాలుర వివరాలను అడగ్గా పొంతన లేని సమాధానాలు చెప్పటంతో అనుమానం వచ్చిన సదరు వాహనదారు పిల్లలను ఖమ్మం-2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు విద్యార్థుల నుంచి వివరాలు కనుక్కొని హాస్టల్‌కు సమాచారం అందించారు. హాస్టల్‌లో పని చేసే సిబ్బంది వచ్చి విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇద్దరిలో ఒకరు అనాసాగరం గ్రామానికి చెందిన విద్యార్థి కాగా, ఇంకొక విద్యార్థి ఖమ్మం ఖానాపురానికి చెందిన వాడని తెలుస్తున్నది.

నేను సెలవులో ఉన్నా: వార్డెన్

విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన విషయమై వార్డెన్ రవూఫ్‌ను వివరణ కోరగా నేను సెలవులో ఉన్నానని తన కుమారునికి ఆరోగ్యం బాగాలేక వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పారు. తన కుమారునికి డయాలసిస్ నడుస్తుండటంతో రెండు రోజులుగా హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. ఎవరికి అప్ప చెప్పి వెళ్లారని అడగ్గా వర్కర్స్ ఉన్నారని సమాధానం చెప్పారు. హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థులు బయటకు వెళ్లిన విషయాన్ని హాస్టల్ వర్కర్స్ తనకు ఫోన్ ద్వారా తెలిపారన్నారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి



తరుణ్ (ఫైల్)

జూలూరుపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మండలంలోని చింతలండా పంచాయతీలో గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చింతలతండా గ్రామానికి చెందిన బాణోత్ తరుణ్ (23) 2021 సంవత్సరంనుంచి పంచాయతీ కార్మికుడు (మల్టీపార్పస్ వర్కర్)గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి రాం ప్రసాద్ ఆదేశాల మేరకు చింతలతండాలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా విద్యుత్ స్తంభానికి అనుకుని ఉన్న చెట్ల కొమ్మలను కార్మికుడు తొలగిస్తున్నాడు. దీంతో చెట్టు కొమ్మ 11కేవి విద్యుత్ వైరుకి తగలడంతో తరుణ్ విద్యుద్ఘాతానికి గురై కిందపడిపోయాడు. గ్రామస్తులు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు. ఇదిలా ఉండగా తరుణ్‌కు ఆరునెలల క్రితమే పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన పల్లవితో వివాహం జరిగింది. అతడి మృతితో కుటుంబసభ్యుల రోధనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ యన మృతి పట్ల ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఎంపీవో తులసీరాంలు సంతాపాన్ని తెలిపారు.

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చింతలతండా పంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్‌గా పని చేస్తూ విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన తరుణ్ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎదులాపురం గోపాలరావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి బాణోత్ ధర్మలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కార్మికుడు మృతి చెందాడని ఆరోపించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మధిరరూరల్/దుమ్ముగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన కొలికపూడి సోమయ్య(37) తన అత్తగారిల్లైన బోనకల్ మండలం రాపల్లి గ్రామం నుంచి రాత్రి 9గంటల సమయంలో ద్విచక్రవాహనంపై మధిర వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో మధిర మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలో వెనకవైపు నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో సోమయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సోమయ్య ఫిజియోథెరపీగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య ఉంది. రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ముగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూరుబాక వంతెన సమీపాన ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పా తమారేదుబాకకు చెందిన తెల్లం అర్జున్ (52) అక్కడికక్కడే మృతిచెందాడు. అర్జున్ తన ద్విచక్రవాహనంపై చర్ల వైపు వస్తుండగా వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రహదారిపైకి ఎగిరిపడడంతో తల వెనుక భాగాన తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాద స్థలంలో లారీ ఆగకుండా వెళ్లడంతో సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవరును అదుపులోకి తీసుకొని లారీను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

అశ్వారావుపేట రూరల్, నవండరు 12 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన భూక్యా రమేశ్(32)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం సేవిస్తూ తిరుగుతున్నాడు. దీంతో కొంతకాలం క్రితం భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈనేపధ్యంలోనే సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించిన రమేశ్ గ్రామసమీపంలో గల చెరువు వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదే సమయంలో మంగళవారం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉన్న కలప పట్టివేత

రేంజర్ కార్యాలయానికి తరలింపు

కరకగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన టేకు కలపను మంగళవారం అనంతారం సెక్షన్ ఆఫీసర్ గోవింద్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ మాట్లాడుతూ.. అక్రమంగా నిలుపుదల చేసిన కలప ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా.. అంబోజు సుధాకర్, మధు ఇంటి వద్ద సుమారు రూ.2లక్షల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకొని ఏడూళ్ల బయ్యారం రేంజర్ కార్యాలయం వద్దకు తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల సెక్షన్ ఆఫీసర్లు సేవ్య, ఏడుకొండలు, సూరయ్య, బీట్ ఆఫీసర్ రోజ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధం

టేకులపల్లి/వైరా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిదోమైలు తండాలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో అజ్మీర భాష్య, ఆయన మనుమడు గణేష్‌కు చెందిన రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. అయ్యప్ప మాలాధారణలో ఉన్న భాష్య మనుమడు గణేష్ ఇంట్లో ఉదయం దీపారాధన పూజచేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు చేలపనులకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పూజాదీపం పక్కనే ఉన్న దేవుని పటాలకు అంటుకొని గడ్డి ఇళ్లకు మంటలు వ్యాపించి రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.20వేలు నగదు, గృహోపకరణాలు, భూమిపట్టా పుస్తకాలు కాలిపోయాయి. టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టేకులపల్లి ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు

వైరా (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని గరికపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు మాతంగి గోపయ్య, సువార్త వృద్ధ దంపతులు. తమ పూరింట్లో అన్నం వండుకుంటున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో పూరింట్లో ఉన్న గోపయ్య కాలుతున్న ఇంట్లో నుంచి బయటకు వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు, అందులోని సమాన్లు మొత్తం దగ్ధమయ్యాయి. ఆర్ఐ వెంకటేశ్వర్లు పంచనా మ నిర్వహించి రూ.లక్షన్నర ఆస్తినష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్య కూలిన కల్వర్టు

- నిలిచిన రాకపోకలు
- భారీలోడులు వెళ్లటమే కారణం?



కల్వర్టు కూలడంతో మరమ్మతులు చేపిస్తున్న డీఈ

కొణిజర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్య గల కల్వర్టు కూలడంతో మంగళవారం సాయంత్రం నుంచి రాకపోకలను నిలిపివేశారు. డబుల్‌రోడ్డు కావటం, వాహనాలు అధికసంఖ్యలో రాకపోకలను సాగించటం, భారీ లోడులతో వాహనాలు వెళ్లటంతో రోడ్డు కుంగి కల్వర్టు మధ్య కూలింది. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, ఏఈ వసుంధర కూలిన కల్వర్టు దగ్గరకు చేరుకున్నారు. తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు. మరమ్మతులను చేపట్టారు. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద మట్టిలోడుతో టిప్పర్లు తిరగటం కూడ కారణంగా ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. డీఈ రమేష్ మాట్లాడుతూ భారీ వాహనాల వల్ల కల్వర్టు వద్ద రోడ్డు కుంగిందని, బుధవారం సాయంత్రం వరకు పూర్తయ్యేలా చూస్తామన్నారు. మపమ్మతులు జరుతూనే ఉన్నాయన్నారు.

వాహనదారుల ఆగ్రహం

చిన్నగోపతి మీదగా అనంతారం, పెద్దగోపతి వెళ్ళవలసి వాహనదారులు, ప్రయాణికులు కల్వర్టు కూలటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం పెద్ద, పెద్ద టిప్పర్లతో మట్టితోలకాలు జరపటం వలన రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. ఈ రోడ్లన్ని ఎవరు బాగు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో వెంటనే మరమ్మతులు చేయాలని, రాకపోకలు నిలిచిపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కుర్నవల్లి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

తల్లాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు తల్లాడ మండలం కుర్నవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బి.నవీన్‌రెడ్డి ఎంపికయ్యాడు. మెదక్ జిల్లా చేగుంట తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14బాలుర వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు నవీన్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన ఉమ్మడి ఖమ్మంజిల్లా అండర్-14 వాలీబాల్ పోటీల్లో నవీన్‌రెడ్డి అత్యంత ప్రతిభను కనపర్చాడు. మంగళవారం నవీన్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయురాలు జె.జాన్సీరాణి, పీడీ ఇ.శివ తదితరులు అభినందించారు.

విద్యుత్ సమస్యలపై 24 గంటలు ఫిర్యాదుల స్వీకరణ

- ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్ ఫ్రీ నంబర్ 1912 ముద్ర
- పొలంబాటలో రైతులకు అవగాహన
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్



ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రించిన టోల్‌ఫ్రీ నెం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అత్యవసర సేవల వలే విద్యుత్‌శాఖలోను 24గంటల పాటు సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు వ్యవసాయ విద్యుత్, గృహ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులందరికి సత్వర పరిష్కారం చూపేందుకు విద్యుత్‌శాఖ నూతన మార్పులకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఇప్పటికే విద్యుత్ ఇంజనీరింగ్ అధికారితో పాటుగా ఇద్దరు సహాయకులతో ప్రత్యేక వాహనాలను ప్రారంభించారు. పల్లెల నుంచి జిల్లా కేంద్రాల వరకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ(టీఎస్ ఎన్పీడీసీఎల్) ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలపై రాష్ట్ర స్థాయిలోని కార్యాలయం అధికారులకు తక్షణం తెలుసుకొని పరిష్కారం జరిగేలా టోల్ ఫ్రీ నెంబర్ 1912ను ఏర్పాటు చేశారు. విద్యుత్ వినియోగదారులు, రైతులకు అవగాహన కలిగేందుకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ ఉపకేంద్రాలు, ప్రధాన సెంటర్లలో వాల్ పేయింటింగ్స్ రాయిస్తున్నారు.

విస్తృతంగా అవగాహన

నిరక్షరాస్యుల నుంచి ప్రతి ఒక్కరూ విద్యుత్ శాఖ ఫిర్యాదుల నెంబర్‌ను గుర్తుంచుకొనేలా కేవలం నాల్గు నెంబర్లుతో 1912 నెంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు 24గంటల్లో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా 1912 నెంబర్‌కు ఫోన్ చేయగానే రాష్ట్ర స్థాయిలోని సిబ్బంది ఫోన్ రిసీవ్ చేసుకుంటారు. తక్షణం సమస్యను విని సంబంధిత విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బందికి సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చర్యలను తీసుకుంటున్నారు.

పొలంబాటలోను అవగాహన



సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

విద్యుత్ సేవల్లో అంతరాయం ఏర్పాడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలి. విద్యుత్ వినియోగదారులు ఎవరైనా ఫోన్ చేయెుచ్చు. పొలంబాట కార్యక్రమంలో ఇప్పటికే అవగాహన ఏర్పాటు చేశాం. ఇప్పుడు ప్రతి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లపై టోల్ ఫ్రీ నెంబర్ 1912ను ముద్రిస్తున్నాం. ఫిర్యాదులు గోప్యంగా ఉంచుతాము.

సమగ్ర సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలి

- డిప్యూటీ సీఈవో నాగలక్ష్మీ
- ఎన్యూమరేటర్లకు రెండో విడత శిక్షణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ ప్రణాళికల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను ఎన్యూమరేటర్లు సమర్థవంతంగా పారదర్శకంగా చేపట్టాలని, ప్రజలు ఇ చ్చిన సమాచారం గోప్యంగా ఉంచాలని, సోషల్ మీడియాలో లీకైనా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఈవో నాగలక్ష్మీ ఆదేశించారు. మంగళవారం డీపీఆర్సీలో ఎన్యూమరేటర్లకు రెండోవిడత సమగ్ర ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే ఫారమ్‌లో ఎటువంటి దిద్దుబాట్లు ఉండకూడదని, సర్వేలో ఇబ్బందులు ఏర్పడితే వెంటనే సూపర్‌వైజర్‌కు తెలియజేయాలన్నారు. ప్రజలు అందుబాటులో ఉండే ఉద యం, సాయంత్రం సమయాల్లో సర్వే నిర్వహించాలని, ప్రతి నివాసానికి 45 నిమిషాల వరకు సమయం తీసుకోవాలని, ప్రతి ఇంటికి వెళ్లి సర్వే జరపాలని ఆదేశించారు. ఆర్వో శ్రీనివాసరావు, మెనేజరు విజయానంద్, ఆర్ఐలు జ్యోతి, రామారావు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్యూమరేటర్లకు పీవో రాహుల్ ఆదేశం
- భద్రాచలంలో సర్వే పరిశీలన



భద్రాచలంలో సర్వే పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఎన్యూమరేటర్లను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైన నేపధ్యంలో మంగళవారం భద్రాచలంలోని గొల్ల బజార్లో పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించి వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయో ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులను ప్రతి అంశం గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకొని నమోదు చేయాలని అన్నిస్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ఏమైనా ఇబ్బందులొస్తే తమ దృష్టికి తేవాలన్నారు. నమోదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచాలని, ప్రతి ఎన్యూమరేటర్ వారికి కేటాయించిన కేంద్రాలలో డేటా ఎంట్రీ సిబ్బంది ద్వారా ఎటువంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నిర్దిష్ట సమయం లో నమోదు చేయించాలన్నారు. ఈ సర్వే వల న పథకాల అమలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

15న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

- 1న హైదరాబాద్‌లో మాలల సింహగర్జన
- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర వైస్‌చైర్మన్ రాజశేఖర్

కొణిజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో 15న నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా మాల ఉపకులాల ప్రభుత్వ, ప్రవేటు రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి వైస్‌చైర్మన్ పల్లా రాజశేఖర్, జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామంలో ఎం. బాబురావు అధ్యక్షతన జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించే సమ్మేళనానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని, ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు. అలాగే డిసెంబరు 1న హైదరాబాద్‌లో జరుగనున్న మాలల సింహగర్జన బహిరంగ సభకు ప్రతి గ్రామం, మండలం, పట్టణం నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి మాలల సత్తా చూపాలని తెలిపారు. 30 సంవత్సరాలుగా మాలలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ మాలలను దోషులుగా చిత్రీకరిస్తున్న వారికి గుణపాఠం చేప్పేవిధంగా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా సహాదారులు లింగాల రవికుమార్, దామల్ల సత్యనారాయణ, ప్రసాద్, బాలరాజు, ప్రకాశం, కిషోర్, రాజు, సీతరాములు, గిరి, ఆనందరావు, తలారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

24న కమ్మవన భోజనాలు

- ఈ సారి ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్కులో : నిర్వాహకులు



మాట్లాడుతున్న కమ్మ సంఘ నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 24న కమ్మ వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు వేజళ్ల సురేష్, గుడవర్తి నాగేశ్వరరావు, రావూరి సైదుబాబు, మిక్కిలినేని నరేంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కమ్మ వనభోజనాలు ఈ సారి వెలుగుమట్ల అర్బన్ పార్కులో అటవీశాఖ అనుమతితో ఏర్పాటుచేశామని, వనభోజనాల కార్యాక్రమాన్ని విజయవంతం చేయటానికి ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో వనభోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా కమ్మ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు. వనభోజనాల కార్యక్రమంలో మహిళలకు, పురుషులకు వేరువేరుగా సాంస్కృతిక, క్రీడలు ఉంటాయన్నారు.

గ్రామీణప్రాంత క్రీడలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని ప్రధాన సెంటర్ల నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతానికి భిన్నంగా వనభోజనాలు వనంలోనే నిర్వహించాలనే ఉద్దేశంతోనే అటవీశాఖ అనుమతితో అర్బన్‌పార్కులో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో గుత్తా వెంకటేశ్వరరావు, మారెళ్ల లక్ష్మీనారాయణ, సరిపూడి సతీష్, జట్ల శ్రీను, తూము శివ, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం జగదీష్‌కాలనీ 19వ వార్డులో

సమగ్ర సర్వే నిలిపివేత

సర్వే చేయాలని కాలనీవాసుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాలనీవాసులు

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని జగదీష్ కాలనీలో 19వ వార్డులో సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు నిలిపివేయడంతో కాలనీవాసులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. 40 ఏళ్లుగా తాము ఇదే కాలనీలో నివాసం ఉంటున్నామని రాష్ట్ర విభజనతో తమ గుర్తింపు పత్రాలన్నీ తెలంగాణలోనే ఉన్నాయని అన్ని రకాల పథకాలు తాము పొందుతున్నా తమని మాత్రం అంధ్రాప్రాంతానికి చెందిన వారని సర్వే బృందం అధికారులు చిత్రీకరించి సమగ్ర కుటుంబ సర్వే చేయడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, నాయకులు సంఘటన ప్రాంతంకు చేరుకొని వారితో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. తక్షణమే సమగ్ర ఇక్కడ కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఈ అంశంపై మరింతగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

రెండో రోజు కొనసాగిన గురుకుల క్రీడలు

విజేతలకు బహుమతుల ప్రదానం



వాలీబాల్ ఆడుతున్న బాలికలు

వైరా నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల 10వ జోనల్ క్రీడల్లో భాగంగా ఖమ్మం, భద్రాద్రి 4వ జోనల్ క్రీడా పోటీలు రెండో రోజు కొనసాగాయి. 14 గురుకుల నుంచి 1180 మంది విద్యార్థులు హాజరుకాగా రెండో రోజు వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. అండర్-14 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.కీర్తి (నేలకొండపల్లి), టి.ఉమారాణి (అడవిమల్లెల), పి.సిపుర(ఇల్లొందు) గెలుపొందారు. అలాగే లాంగ్ జంప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జి.మంజుని(కల్లూరు), వి.వైష్ణవి(ఇల్లెందు), జి.శ్రీహర్షిని(ఇల్లెందు) నిలిచారు. అండర్-17 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎం.నిహార్షిత(భద్రాచలం), బి.ప్రవచన(ఇల్లందు), కె.స్రవంతి(భద్రాచలం) గెలుపొందారు. లాంగ్‌జంప్‌లో సీ.హెచ్.వినీల(ఇల్లెందు), కె.స్రవంతి(భద్రాచలం), డి.సాగరిక(టేకులపల్లి) వరుసగా మొదట మూడు స్థానాల్లో గెలుపొందారు. అండర్-19 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు టి.అస్మిత(కల్లూరు), పి.నేహా(పాల్వంచ), వి. పవిత్ర(కూసుమంచి) గెలుపొందారు. అలాగే లాంగ్ జంప్‌లో ఎన్.సరిత(ఇల్లెందు), ఎస్.గ్లోరి(పాల్వంచ), డి.పూజశ్రీ(ములకలపల్లి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. అండర్-17 విభాగంలో 3000 వేల మీటర్ల పరుగుపందెంలో ప్రథమ బహుమతి కె.స్రవంతి (భద్రాచలం) గెలుచుకున్నారు. అండర్-19 విభాగంలో 3000 వేల మీటర్ల పరుగుపందెంలో ఎన్. భావన(ములకలపల్లి), జి.పూజితశ్రీ(అంబేద్కర్ కలేజి, ఖమ్మం), పి.సంధ్య(ఎర్రుపాలెం) వరసగా మొదటి మూడు స్థానాలు గెలుపొందారు. విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు.



లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థిని

సీడీసీ చైర్మన్‌గా నరేంద్ర



కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ కేన్ డెవలప్‌మెంట్ చైర్మన్(సీడీసీ)గా కస్తాల నరేంద్రను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ షుగర్స్ కమిషన్ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినాయి. మండల పరిధిలోని తెలగవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కస్తాల నరేంద్రను నియమిస్తూ జిల్లా అసిస్టెంట్ కమిషనర్, కాకతీయ షుగర్స్ కార్యాలయానికి ఉత్తర్వులు అందినాయిని తెలిసింది. మండలంలోని తెలంగవరం గ్రామానికి చెందిన నరేంద్ర కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నరేంద్ర సమర్థను పరిగణలోకి తీసుకొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌లు సీడీసీ చైర్మన్‌గా నియామకానికి ప్రభుత్వానికి సిపార్సు చేశారు. దీంతో డైరెక్టర్ ఆఫ్ షుగర్స్ కమిషన్ కార్యాలయం నుంచి ఆయన ఎంపికకు అమోదం తెలుపుతూ ఆదేశాలు వెలువడినాయి. రైతు కుటుంబానికి చెందిన నరేంద్రను నియమించటం పట్ల మండలంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు.

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

ఖమ్మంటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీలు వేరువేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఈవిద్యాసంవత్సరంలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పరిష్కారం చేయటం లేదన్నారు. పూర్తిస్థాయి వైస్‌ఛాన్స్‌లర్‌ను నియమించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.సుధాకర్, టీ.ప్రవీణ్ పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు బాసర ట్రిపుల్‌ఐటీలో ఆందోళనకు గోడదూకి మరీ హాజరయ్యారని, ఇప్పుడు సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	30 రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
కాకరకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	48
దోసకాయ	38-68
గోరుచిక్కుడు	68
చిక్కుడు	58
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	40
దొండ	34-40
సొరకాయ	30
క్యారెట్	78
క్యాప్సికం	68
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

నిర్లక్ష్యం వద్దు

» జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): వైద్యకార్యక్రమాలు అమలులో నిర్లక్ష్యం వహించొద్దని, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. కళావతిబాయి పేర్కొన్నారు. మంగళవారం ముస్తాఫానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు.రిజిస్టర్, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. మందులు, ఖర్చయిన వివరాలు రిజిస్టర్‌లో ఎందుకు అప్‌డేట్ చేయలేదంటూ ఫార్మసిస్టును అడిగితెలుసుకున్నారు. స్టాకు, ఖర్చయిన వివరాల్లో తేడారావద్దని, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. మందుల పట్టిక బోర్డును పరిశీలించి ఏరోజు కారోజు మందుల వివరాలు బోర్డులో ప్రదర్శించాలన్నారు. అన్ని వైద్య ఆరోగ్య కార్యక్రమాల (సేవలు)ను నిర్దేశించిన సబ్‌సెంటర్ పరిధిలో అమలు చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందించి, వైద్యం పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. జిల్లాలో సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను నూటికి నూరు శాతం చేరుకొనే విధంగా పని చేయాలని ఆదేశించారు. అన్ని పీహెచ్‌సీల్లో మందుల స్టాకు, ఖర్చయిన వివరాలతో పాటు అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్ పుస్తకాల అందజేత

ఏన్కూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పూర్వ విద్యార్థులు కేటీపీఎస్ ఇంజనీర్ నాగయ్య, అల్యూమినీ కార్యదర్శి కృష్ణలు కలిసి మంగళవారం ఏన్కూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు రూ.20వేల విలువ చేసే జేఈఈ మెయిన్స్ పుస్తకాలను ఉచితంగా అందించారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందించారు. 1991-92 పదోతరగతిలో స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించిన పింజర్ల నాగేశ్వరరావు గ్రంథాలయ పుస్తకాల కొనుగోలుకు రూ.5వేలను అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, విశ్రాంత డిప్యూటీ సెక్రటరి కొదుమూరి రవి, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, ఆనందరావు, కుటుంబరావు, శివకుమార్, ఏటీపీ సునీల్, ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, శ్రీనివాస్, మోహన్, శారాస్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతు సదస్సు ఏర్పాటు

వైరా నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులతో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రబీ సాగుకు నీటి సరఫరాకు సంబంధించి సదస్సు ఏర్పాటు చేశామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు ఈ సదస్సులో పాల్గొని రబీ సాగుకు నీటి సరఫరాకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

వైద్యవిద్యార్థినికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న దాతలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గజెల్లి పూజితకు వైద్య విద్య చదువేందుకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు అందించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ చేతుల మీదుగా విద్యార్థికి చెక్కును అందించారు. పూజితకు నర్సంపేట ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రవేశం పొంది, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు చేయుత అందించాలని ట్రస్ట్ నిర్ణయించిందని ట్రస్ట్ చైర్మెన్ పరిశ పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి వెంకన్న పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

తిరుమలాయపాలెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఆరుగురిపై కేసు నమోదుచేశారు. మూడుసెల్‌ఫోన్లు, మూడుసైకిళ్లు, రూ.2350 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లకారంపై ఏవగింపు

» పిచ్చి మొక్కలు, చెత్తతో లకారం ట్యాంక్‌బండ్

» పనిచేయ్యని సీసీ కెమెరాలు

» అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

» నెలకు రూ. 2లక్షలు కేఎంసీ నిధులు

» పర్యవేక్షణ లేక నగరవాసుల పెదవి విరుపు



ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): నగరప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన లకారం ట్యాంక్ బండ్‌పై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నిర్వాహణ సక్రమంగా లేనికారణంగా కొంతకాలంగా లకారం ట్యాంక్‌బండ్ తన ఆకారం కొల్పోతోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు మెయ్యి మంది, శని,ఆదివారాల్లో మాత్రం 2వేల నుంచి 3వేలకు పైగా నగరవాసులతో పాటుగా సమీపంలోని గ్రామాల ప్రజలు ట్యాంక్ బండ్‌ను సందర్శిస్తారు. లకారం ట్యాంక్‌బండ్‌పై వృద్దుల నుంచి పిల్లల వరకు వారికి కావాల్సిన పరికరాలు, ఆటల క్రీడాపరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతో పాటుగా అనుకూలమైన వాకివే, తీగలవంతెన ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. పచ్చదనంపై సరైన నిర్వాహణ లేకపోవటంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. చెత్తచెదారంతో ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం కనిపిస్తోంది. కొద్దిసేపు అక్కడ సేదతారాలంటే దోమలతో వేగలేని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల నిర్వాహణ సరిగా లేకపోవటంతో ధ్వంసమైనాయి. ఇటీవల జేబుదొంగలు బెడద పెరిగింది. అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సీసీ కెమెరాలు పనిచేయటం లేదు. లకారం వాకర్స్ క్లబ్ ద్వారా ప్రతీ రోజు వందల మంది ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేస్తున్నారు. కోతుల బెడద అధికంగా ఉండటంతో యోగా, వాకింగ్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ట్యాంక్ బండ్ నిర్వాహణ కోసం ప్రతీ నెల రూ. 2లక్షలకు పైగా చెల్లిస్తున్నారు. కేఎంసీ అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగానే లకారం ట్యాంక్‌బండ్ ఆకారం కోల్పోయిందని సందర్శకులు చెబుతున్నారు. లకారం ట్యాంక్ బండ్ పర్యవేక్షణపై కేఎంసీ డీఈ శ్రీనివాసరావును వివరణ కొరగా పర్యవేక్షణ పెంచి ఆహ్లాదం పెంచుతామని, సీసీ కెమెరాలు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.



నిరుపయోగంగా మారిన ఫుడ్‌స్టాల్స్



పెరిగిన చెత్త



మూలనపడిన సీసీ కెమెరాలు



మరుగుదొడ్ల దుస్థితి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

అధికారులతో అదనపు కలెక్టర్ల సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్లు, శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ధాన్యం కొనుగోళ్ల, కేంద్రాల నిర్వహణపై సమీక్షించారు. మండలాల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 2,88,888.78 ఎకరాల్లో వరి సాగుచేయగా, 6,64,444.2 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు.. మొత్తం 324 ధాన్య కొనుగోలు కేంద్రాల ఏర్పాటుచే చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం 24గంటల లోపు సంబంధిత మిల్లుకు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

తిరుమలాయపాలెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా ఇమ్యునేజేషన్ ప్రోగ్రాం అధికారి చంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది విధినిర్వాహణలో అలసత్వం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

» నేలకొండపల్లి ఎంఈవో చలపతిరావు



మాట్లాడుతున్న చలపతిరావు

నేలకొండపల్లి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి క్రీడలు దోహదం చేస్తాయని మండల విద్యాధికారి చలపతిరావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నేలకొండపల్లి వాసవీభవన్‌లో మండలంలోని పాఠశాలల విద్యార్థులకు భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పాటలు, నృత్యాలు, డిబేట్‌లలో పోటీలను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ చాలామంది విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించలేరని, పోటీల్లో పాల్గొంటుంటే వారి శక్తి, సామర్థ్యాలు బయటకొస్తాయన్నారు. అంతకుముందు పాటలు, నృత్యాలు, డిబేట్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందచేసారు. కార్యక్రమంలో నెల్లూరి వీరబాబు, వెల్లంపల్లి శ్రీనివాస్, కోదూరి వెంకటాచారి, భవనాశి దుర్గారావు, యలమద్ది లెనిన్, దండా రవీంద్రబాబు, మచ్చా రఘుపతిరావు, పచ్చా తిరపతయ్య, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, తెల్లగొర్ల లింగస్వామి, వల్లంచెట్ల భాస్కరరావు, మచ్చా రేణుక, ఏటుకూరి వెంకటరామారావు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన శ్రీధర్‌రెడ్డి

కూసుమంచి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు అరిగోసపడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ నాయకులతో కలిసి పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రోజులకొద్దీ నిబంధనల పేరుతో రోజులకొద్ది ఉంచుతున్నారని ఆరోపించారు. కాంటాలు పూర్తవగానే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వడం లేదని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదేపరిస్థితి ఉందన్నారు. కేంద్రం ధాన్యానికి మద్దతుధర ఇచ్చి, ట్రాన్స్‌పోర్టు,గోనెసంచులు నిర్వహకులకు కమిషన్ ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు అన్యాయం జరిగితే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే ఉద్యమ బాట పడుతామని హెచ్చరించారు.

యూసీమాస్‌లో గ్రూప్ చాంపియన్‌గా హార్వెస్ట్



ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన యూసిమాస్(యూనివర్సిల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అరిథ్మెటిక్ సిస్టమ్)అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు తెలంగాణగ్రూప్ ఛాంపియన్‌గా నిలిచారు.ఈవివరాలు విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంనుంచి మొత్తం 1200 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో హార్వెస్ట్ పాఠశాల నుంచి 46 మంది పాల్గొన్ని చాంపియన్‌గా నిలిచారని తెలిపారు.

'పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం'

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

వైరానవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సీపీఎం వైరా పట్టణ 15వ మహాసభ చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, గుడిమెట్ల మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. సీపీఎం జెండాను సీనియర్ నాయకుడు కొత్తా సీతారామయ్య ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యావీరభద్రం, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, మేరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరికి రూ.500 బోనస్ ప్రకటించిన ఘనత కాంగ్రెస్‌దే

» మేయర్ పునుకొల్లు నీరజ

» వెలుగుమట్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన ఘనత కాంగ్రెస్‌కు దక్కిందని మేయర్ పునుకొళ్ల నీరజ పేర్కొన్నారు. మంగళవారం 8వ డివిజన్ వెలుగుమట్లలో మెప్మాఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. దొడ్డు రకపు ధాన్యానికి మంచి ధర రావాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దళారుల, ప్రైవేట్ వ్యాపారుల వద్దకు రైతులు వెళ్లి మోసపోకుండా ప్రభుత్వ ధాన్యపు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులకు అండగా ఉంటుందని, ని రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహణ ఉండాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్, టీపీఎంసీ సుజాత, సీవో సాల్మ, ఏఈవో దివ్య పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నీరజ

నిబంధనలను సడలించి పత్తిని కొనుగోలు చేయాలి

ఖమ్మం రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): నిబంధనలు సడలించి రైతులు పత్తిని బేషరతుగా కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని గుర్రాలపాడు ప్రాంతంలోని సీసీఐ కేంద్రాలను అఖిలభారత ప్రగతి శీల రైతు సంఘం బృందం మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు బందెల వెంకయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

తిరుమలాయపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో 184బ్లాకులుగా విభజించి 148 మంది ఇన్విజిలేటర్లు, 17మంది సూపర్‌వైజర్లుసర్వేలో పాల్గొంటున్నారు. ఈకార్యక్రమాన్ని ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ, పర్యవేక్షించారు.

15న మాలల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు12 (ఆంధ్రజ్యోతి): నవంబరు 15న ఖమ్మంలో జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోకన్వీనర్ పేరం మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమవేశంలో మాట్లాడారు. ఈసమ్మేళనానికి ప్రతీ మాల హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణవేణికి నాగబత్తిని మాలతి జీవిత సాఫల్య పురస్కారం

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారిణి వనం కృష్ణవేణికి నాగబత్తిని మాలతి జీవిత సాఫల్యపురస్కారం ప్రకటించారు. కళారంగంలో ఆమె చేసిన సేవలకు గానూ ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి తన దివంగత సతీమణి పేరున ఈ పురస్కారాన్ని నెలకొల్పారు. మొదటి పురస్కారాన్ని ఈనెల 24న భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆమెకు అందజేయనున్నారు.

టీడీపీలోకి మాజీ కౌన్సిలర్ ఉపేందర్



టీడీపీలో చేరుతున్న మాజీ కౌన్సిలర్ పెనుగొండ ఉపేందర్

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పెనుగొండ ఉపేందర్ మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ హడ్‌హక్ కమిటీ సభ్యులు మాజీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర ఆధ్వర్యంలో పెనుగొండ ఉపేందర్ తెలుగుదేశంపార్టీలో చేరారు. తన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఉపేందర్ టీడీపీ(పార్టీ ఆవిర్భావం) 1982 నుంచి కొనసాగారు.. 2005 నుంచి 2010 వరకు తెలుగుదేశంపార్టీ నుంచి ఖమ్మం మునిసిపాలిటీలో కౌన్సిలర్‌గా, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2014లో తుమ్మల నాగేశ్వరరావుతో పాటు టీఆర్‌ఎస్‌లో చేరారు. తిరిగి మంగళవారం మళ్లీ టీడీపీలో చేరారు. సొంతగూటికి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూరినాటి రమణ, చింతనిప్పు నాగేశ్వరరావు, బోడేపుడి రవి, అనంత్ కుమార్, వడ్లమూడి సాగర్, బయ్యన వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కొనసాగించటం అభినందనీయం

» కాంగ్రెస్ జిల్లా నాయకుడు దయాకర్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేశ్వరపురంలో నాలుగు రోజుల పాటు జరుగనున్న ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుంబూరి దయాకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని ఆచరించటం అభినందనీయమన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ ఒంగోలు జాతి ఎద్దుల పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. పరమశివుడు అందరినీ చల్లగా చూడాలని దయాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజేశ్వరపురం సహకార సంఘం చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, దండా రంగయ్య, ఇస్లావత్‌బాలాజీ, జటంగి చంద్రమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ZONE
బుధవారం 13 నవంబరు 2024
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
వైరా-మధిర
సత్తుపల్లి
VYRA, MADHIRA, SATHUPALLY



'గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

తల్లాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.వీరంరాజు అన్నారు. మంగళవారం తల్లాడలో పార్టీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ సేకరణలో తల్లాడ మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈనెలాఖరు వరకు మండలంలోని అన్నిబూతుల అధ్యక్షుల నియామకం జరుగుతుందని తెలిపారు. యువత, మహిళలు, రైతులు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్లా నాగులు, మండల ప్రధాన కార్యదర్శి గాదె కృష్ణారావు, కార్యదర్శి రాయల రమేష్, తమ్మిశెట్టి కృష్ణ, సాయిచంద్, కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా చలపతిరావు ఎన్నిక



వైరా నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వైరా పట్టణ కార్యదర్శిగా చింతనిప్పు చలపతిరావు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సీపీఎం 15వ వైరా పట్టణ మహాసభలో చలపతిరావు కార్యదర్శిగా, 16మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. కల్లాల్లోనే ధాన్యం

» ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతుల వేడుకోలు



తల్లాడలో కల్లంలో ఆరబోసిన ధాన్యం

తల్లాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం ఆరబెడుతూ రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు వాటిని ప్రారంభించినప్పటికీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. వానాకాలం(ఖరీఫ్) వ్యవసాయ సీజన్‌లో ముందుగా చెరువులు, కుంటలు, వాగులు, బోర్ల కింద తల్లాడ మండలంలో 10,183ఎకరాల్లో వరి సాగుచేశారు. వరికోత నూర్పిడిలు నెల రోజుల నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక్కో ఎకరాకు 25నుంచి 30క్వింటాళ్ల మేరకు ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో తెలగవరంలో సన్నరకం ధాన్యం, రామానుజవరంలో సన్న, దొడ్డురకాలు, కుర్నవల్లి, అన్నారుగూడెంల్లో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సొసైటీల ఆధ్వర్యంలో తల్లాడ, బిల్లుపాడు, అన్నారుగూడెం, గొల్లగూడెం, పినపాక, కుర్నవల్లి గ్రామాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఆరురోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుంది. కొనుగోలు కేంద్రాల వద్ద కల్లాల్లో ధాన్యాన్ని రోజుల తరబడి ఆరబెడుతూ కొనుగోలు కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం ఆకాశం మేఘావృతం కావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

ఇబ్బందులు లేకుండా చూడాలి

● బోడ వెంకట్, రైతు, గాంధీనగర్ తండా

వానాకాలం సీజన్‌లో 11ఎకరాలు కౌలుకు తీసుకొని సన్నరకం వరి సాగు చేశాను. తొమ్మిది రోజుల క్రితం ధాన్యం నూర్పిడి చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు తల్లాడ సొసైటీ కొనుగోలు కేంద్రానికి తెచ్చాను. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం లోపు తేమ, తాలు ఒక శాతం మేరకే ఉంది. అయినప్పటికీ కొనుగోళ్లలో జాప్యం జరుగుతుంది. దీనివల్ల కొనుగోలు కోసం ఎదురుచూస్తూ ఇబ్బంది పడుతున్నాం.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

● తమ్మిశెట్టి తిరుపతిరావు, రైతు, తల్లాడ

ఎకరంన్నర పొలంతో పాటు మరో నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వరిని సాగు చేశాను. నూర్పిడి చేసి ఐదురోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. ఆకాశం మేఘావృతం కావడం వల్ల వర్షం వస్తే నష్టపోవాల్సి వస్తుంది. ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలి.

క్వింటాకు రూ.500బోనస్ ఇవ్వాలి

» సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు



కాకర్లపల్లిలో ధాన్యపు రాశులను పరిశీలిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

సత్తుపల్లిరూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన క్వింటాకు రూ.500బోనస్ హామీ ఆచరణలో లేదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాకర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రాలలో కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, క్వింటాకు రూ.2వేలు కూడా రావడం లేదన్నారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులు పాలు చేయకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శరత్, వెంకటేశ్వర్లు, కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన పెనుబల్లి



అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్పలు, గ్రామస్థులు

పెనుబల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): అయ్యప్పలస్వాముల నామస్మరణతో పెనుబల్లి మారుమోగింది. సోమవారం రాత్రి పెనుబల్లిలో నాగుల నాగేశ్వరరావు గురుస్వామి 18వ పడి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వామి నంభూద్రి పద్మనాభన్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కేరళకు చెందిన ప్రత్యేక బృందం అయ్యప్పస్వామి నగర సంకీర్తన నిర్వహించారు. అయ్యప్పస్వామిని రథం పై కూర్చోబెట్టి నాగుల నాగేశ్వరరావు స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. కోదాడకు చెందిన భాస్కర గురుస్వామి పలు దేవతామూర్తుల పాటలతో ఉర్రూతలూగించారు.

'పంటలలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి'

చింతకాని, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మిరప, వరి పంటలను నిత్యం పరిశీలిస్తూ యాజమాన్య పద్ధతులు చేపట్టాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్త కే. రవికుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నరసింహపురం, పందిళ్లపల్లి గ్రామాల్లోని వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో సుడిదోమతో పాటు బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు వ్యాపిస్తుందన్నారు. మిరప పంటలో కొమ్మకుళ్లు, బూజు తెగుళ్లు వ్యాపిస్తున్నవని, సకాలంలో రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి లాభాలు సాధించలన్నారు. అనంతరం రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈవోలు రాము, అయేషా, సుప్రజ, కార్తీక్, కళ్యాణి, తేజ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): బాధ్యతగా వ్యవహరిస్తూ సేవలు సత్వరమే అందించాలని, ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఓపీ సేవలను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, పనివేళల్లో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించగా ఆరోగ్యమిత్ర సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. హాజరులో అవకతవకలు ఉన్నాయని, విధులలో అలసత్వం ప్రదర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆసుపత్రి పాత భవనం కావడంతో రోగులతో పాటు వైద్యులు సేవలందించేందుకు సురక్షితంగా లేదని, వెంటనే 100 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే దృష్టికి వైద్యాధికారులు తీసుకెళ్లగా త్వరలోనే ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తల్లాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. తల్లాడకు చెందిన తడికమళ్ల కృష్ణవేణి నడుచుకుంటూ డివైడర్ దాటుతుండగా కల్లూరు నుంచి రింగ్‌రోడ్డు సెంటర్ వైపు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను 108వాహనంలో చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

తల్లాడలో ఏకనామం భజన

తల్లాడ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): స్థానిక హన్మత్ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం వీహెచ్‌పీ, తల్లాడ ప్రఖండ ఆధ్వర్యంలో 24గంటల ఏకనామం భజన చేపట్టారు.. కార్తీక ఏకాదశి సందర్భంగా హరేరామ హరేకృష్ణ ఏకనామం భజన నిర్వహించారు. అంజనాపురంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో చాలీసా గోవిందనామములు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

ఏన్కూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగుపై ఏడీఏ కరుణశ్రీ రైతులకు అవగాహన కలిగించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాచారం రైతువేదికలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న సాగు చేసే రైతులు నవంబరు నెలాఖరులోపు పంట వేసుకోవాని సూచించారు. విత్తనాలు కొనేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పంట కాలం పూర్తయ్యేవరకు బిల్లులను భద్రపరుచుకోవాలన్నారు. అనంతరం ఆయిల్‌ఫామ్ సాగు యొక్క ఆవశ్యకత, అయిల్‌ఫామ్‌సాగు ఆవశ్యకత, ప్రభుత్వం అందించే సబ్సిడీ, ఆదాయం గురించి రైతులకు వివరించారు. అధికారుల సూచనలు పాటించి లాభాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవో లహరి, నవ్య, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

రైతు సదస్సు ఏర్పాటు

వైరా నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులతో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రబీ సాగకు నీటి సరఫరాకు సంబంధించి సదస్సు ఏర్పాటు చేశామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు ఈ సదస్సులో పాల్గొని రబీ సాగుకు నీటి సరఫరాకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

నేడు ప్రజా మరుగుదొడ్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

కారేపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో మాధారం డోలమైట్ వారు సహకారంతో నిర్మాణంతో ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో సురేందర్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈవిషయం గమనించిన గతంలో పనిచేసిన ఎంపీడీవో చంద్రశేఖర్ స్థానిక మాదారం డొలమెంట్ అధికారులతో సంప్రదించి మరుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు.

ఎర్రుపాలెం ఏవోగా సాయిశివ



ఎర్రుపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారిగా బోయినపల్లి సాయిశివ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల నుంచి డిప్యూటేషన్‌పై ఎర్రుపాలేనికి వచ్చానని తెలిపారు. గతంలో ఎర్రుపాలెం ఏవోగా పనిచేసిన ఎం.రాధ నేలకొండపల్లికి బదిలీ అయ్యారు. నూతనంగా విధుల్లో చేరిన ఏవోకు వ్యవసాయ శాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బోనకల్ ఏవోగా వినయ్ కుమార్



బోనకల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా పసునూరి వినయ్ కుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఏవోగా పని చేసిన విజయభాస్కర్‌రెడ్డి బదిలీ పై భద్రాచలానికి వెళ్లారు. నూతనంగా విధుల్లో చేరిన ఏవోకు వ్యవసాయశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల క్రీడలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు రామారావు, తిరుపతిరెడ్డి, విశ్వేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా యువజన నాయకుడు వేజండ్ల సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, పీఈటీలు కోన రమేష్, మారబత్తుల జమలయ్య, నాయకులు మల్లెల లక్ష్మణరావు, జంగా పుల్లారెడ్డి, షేక్ ఇస్మాయిల్, వీలం అక్కిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, యన్నం పిచ్చిరెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, రాజీవ్‌గాంధీ, బాబురావు, శ్రీను పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

చింతకాని, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండల కేంద్రంలోని భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం దేవాలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహణ అధికారి రామకోటేశ్వరరావు, అర్చకులు ఫణిహారం శ్రీనివాసచార్యులు, గోపి కృష్ణామాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

'పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం'



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్ల కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సీపీఎం వైరా పట్టణ 15వ మహాసభ చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, గుడిమెట్ల మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. సీపీఎం జెండాను సీనియర్ నాయకుడు కొత్తా సీతారామయ్య ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యావీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మేరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు తదితరులున్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం'

బోనకల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్ తెలిపారు. మండలంలోని రాయనపేట గ్రామంలో మంగళవారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే పార్టీ తమదేనని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, వల్లెబోయిన జానయ్య, ఏలూరి పూర్ణచందర్‌రావు, వల్లెబోయిన వీరభద్రం, ఆనందరావు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. వైరా డివిజన్ సీపీఐ కార్యదర్శి ఎర్రబాబు, రాష్ట్ర మహిళనాయకురాలు ఏపూరి లతదేవిల ఆధ్వర్యంలో సీపీఐ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ నాయకులు వడ్డే వెంటకయ్య, పుచ్చాకాయలశ్రీనువాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పుస్తకాల అందజేత

ఏన్కూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పూర్వ విద్యార్థులు కేటీపీఎస్ ఇంజనీర్ నాగయ్య, అల్యూమినీ కార్యదర్శి కృష్ణలు కలిసి మంగళవారం ఏన్కూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు రూ.20వేల విలువ చేసే జేఈఈ మెయిన్స్ పుస్తకాలను ఉచితంగా అందించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందించారు. 1991-92 పదో తరగతిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన పింజర్ల నాగేశ్వరరావు గ్రంథాలయ పుస్తకాల కొనుగోలుకు రూ.5వేలను అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, విశ్రాంత డిప్యూటీ సెక్రటరి కొదుమూరి రవి, పూర్వవిద్యార్థులు శ్రీనివాస్, ఆనందరావు, కుటుంబరావు, శివకుమార్, ఏటీపీ సునీల్, ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, శ్రీనివాస్, మోహన్, శారా స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందిస్తున్న పూర్వ విద్యార్థులు